క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సోహెల్‌బాషా, సుబ్బమ్మ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 విభాగం పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలక ఎంపికైనట్లు హెచ్ఎం రాములు నాయక్ తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీఈటీ వెంకటేశ్వర రెడ్డి,అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ప్రసాద్, పవన్, ప్రభాకర్‌రెడ్డి, సువర్ణ, ప్రతాప్‌రెడ్డి తదితరులను హెచ్ఎం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



ధరణేశ్వరరెడ్డి (ఫైల్)

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ధరణేశ్వరరెడ్డి (49) అనారోగ్యంతో బుధవారం తెలవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్టారెడ్డి, మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు, నాయకులు రవికుమార్‌రెడ్డి, జగదీష్, బందెనవాజ్, లద్దగిరి గ్రామానికి వెళ్లి ధరణేశ్వర రెడ్డికి నివాళులర్పించి, ఆ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో గురువారం క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని గూడూరుకు వెళ్లే దారిలో దైవ సన్నిధి పండుగలో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని బైబిల్ మిషన్ సంఘం సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక ప్రార్థన కార్యక్రమానికి వాక్యోపదేశకులు అద్భుత కుమార్ తదితరులు హాజరవుతారని, గ్రామ, మండల క్రైస్తవులు ప్రార్థనలలో పాల్గొని దేవుడి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

కూలీలందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి



కంబదహాల్‌లో ఈ కేవైసీని నమోదు చేస్తున్న ఏపీఓ రామన్న

సి.బెళగల్: మండలంలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని మండల ఉపాధిహామీ ఏపీఓ రామన్న అన్నారు. ఆయన బుధవారం ఆయా గ్రామాల్లో టీఏలు, ఎఫ్ఏలు చేపట్టిన కూలీల ఈ-కేవైసీ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో 12,158 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా అందులో 22,713 మంది వేతనదారులు ఉన్నారని, వీరందరూ ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది చేపట్టిన ఈ-కేవైసీ నమోదు కార్యక్రమంలో తమ వివరాలతో ఈ-కేవైసీని నమోదు చేసుకోవాలన్నారు. టీఏలు మురళీ, రామ్‌శంకర్, గోవర్ధన్, లక్ష్మి, రాజశేఖర్, సి.బెళగల్ ఎఫ్ఏ అబీబ్ తదితరులు కొత్తకోట, పోలకల్, క్రిష్ణదొడ్డి, ముడుమాల, గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు చేశారు.

సంపూర్ణ భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా ఏకాదశి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధార్మిక ప్రవచకులు ధమాం జగదీష్ సందేశమిచ్చారు. మోక్ష సాధనకు జ్ఞాన సముపార్జన కన్న మించిన మార్గం లేదని, ఆ మార్గాన్ని చూపుట కు భగవంతుడి అంశ కలిగిన సద్గురువులలో విద్యా ప్రకాశానంద స్వామి ఒకరన్నారు. గీతా ప్రచార ధామం వ్యవస్థాపక అధ్యక్షుడు గీతారత్న డీవీ రమణ, కార్యదర్శి ఇల్లూరి వెంకటరమణ, సభ్యులు సింహాద్రి రమేష్, జగన్, మహాబలేష్, విష్ణు సహస్రనామ సంఘం అధ్యక్షుడు మల్లెల పుల్లారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాతో రక్ష

- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు
- అక్టోబర్ 15 వరకు కార్యక్రమం
- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న పశువైద్యులు





గని గ్రామంలో అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది, వ్యాధి సోకడంతో గిట్టెలో ఏర్పడిన పుండ్లు

గడివేముల: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. వీటిని రక్షించుకోవాలంటే పశువులకు ముందస్తు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. ఈ కాలంలో పశువులకు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి పికార్న వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా1, సాట్1, సాట్2, సాట్3 వంటి రకాలు ఉన్నాయి. సాధారణంగా ఈ వ్యాధి పశువుల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో వస్తుంది. గాలి ద్వారా వ్యాపిస్తుంది. దేశవాళి పశువుల కంటే సంకర జాతి పశువుల్లో ఎక్కువ నష్టం కలిగిస్తాయి. దూడలు గాలి కుంటు వ్యాధి బారిన పడితే తల్లిపాలు తాగిన వెంటనే మరణిస్తాయి. గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 12 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ఉచితంగా టీకాలు వేస్తున్నారు. పాడిరైతులకు ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జీవాలకు వ్యాపించే వ్యాధులపై ప్రతి రైతు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని చెబుతున్నారు. గడివేముల మండలంలో 18258, ఓర్వకల్లు 1,07,229, పాణ్యం, కల్లూరు మండలాల్లో దాదాపు 1.5 లక్షల గేదెలు ఉన్నాయి.

గాలికుంటు వ్యాధి

వాతావరణ మార్పులతో కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ఏటా వర్షాకాలంలో ఆవులు, గేదెలకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. వ్యాధి సోకినప్పుడు పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

టీకాలు తప్పనిసరి

వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి. కొందరు రైతులు పాడి దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందనేది అపోహ మాత్రమేనంటున్నారు వైద్యులు. వ్యాధి ముదిరి పశువులు మృతి చెంది నష్టపోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే నివారించవచ్చని చెబుతున్నారు.

నివారణ మార్గాలు

వ్యాధి సోకిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. నోటిలో ఉన్న పుండ్లకు బోరిక్ ఫౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి ఈగలు వాలకుండా వేప నూనె రాయాలి. యాంటిబయాటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

టీకాలు వేయించాలి



గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ప్రత్యేక టీకా కార్యక్రమం పెట్టారు. గ్రామాల్లో పాడి రైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా టీకాలు వేస్తాం. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయించాలి. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధి లక్షణా లు ఉంటే వెంటనే రైతు సేవా కేంద్రాల్లో సమా చారం ఇవ్వాలి.

–డాక్టర్ సాయి హరిణి, పశువైద్యాధికారి, గడివేముల

రోడ్డు పక్కన ఉల్లి పారబోత



గార్గేయపురం సమీపంలో రోడ్డు పక్కన పడేసిన ఉల్లి బస్తాలు

కర్నూలు(రూరల్): జిల్లాలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత కారణంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు పేరుకు పోయాయి. కొనేవారు లేకపోవడంతో రోజూ వందలాది క్వింటాళ్ల ఉల్లి కుళ్లిపోతుంది. యార్డు లో ఉల్లి నిల్వలు పేరుకుపోవడంతో వందల క్వింటాళ్ల ఉల్లిని అధికారులు, మార్క్‌ఫెడ్ వారు గార్గేయపురం డంప్ యార్డులో పడేస్తున్నారు. రోజురోజుకు యా ర్డులో ఉల్లి నిల్వలు పెరుగుతున్నా యే తప్పా తగ్గడం లేదు. దీంతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి బస్తాలు, యార్డులోని ఉల్లి నిల్వలను ఏంచేయాలో అధికారులకు దిక్కుతోచడం లేదు. ఈ స్థితిలో బుధవారం మధ్యాహ్నం టిప్పర్ లారీలో ఉల్లి బస్తాలను తీసుకొచ్చి గార్గేయపురం దర్గా సమీపాన నగర పాలక సంస్థ డంప్ యార్డుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన పడేశారు. దాదావు 200 ఉల్లి బస్తాలను పడేసినట్లు తెలుస్తోంది. ఉల్లికి గిట్టుబాటు ధర లేక ఇక్కడ తెచ్చి పడేశారా? లేక నగరంలోని మార్కెట్ యార్డు అధికారులు ఉల్లి దిగుబడులను తెచ్చి పడేశారా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పడేసిన ఉల్లి బస్తాలను గార్గేయపురం, సమీప గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో, భుజాన వేసుకొని కొందరు ఎత్తుకెళ్లిపోయారు.

ప్రభుత్వ మోసంపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో.. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఐద్వా న్యూసిటీ కమిటీ మూడో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. నేతలు కిరణ్మయి, శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె, జిల్లా కార్యదర్శి అలివేలుతో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులు, దోపిడీలు, హత్యలు, అత్యాచారాలను నిరోధించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే మహిళలపై దాడులకు అవకాశం ఉండదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా కార్యదర్శిగా ఎస్.శ్యామలమ్మ, అధ్యక్షురాలిగా ఎం. కుమారి, గౌరవాధ్యక్షులుగా రత్నమ్మను ఎన్నుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించరాదు



ధర్నా చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులు, గిరిజనులకు తీవ్ర అన్యా యం చేస్తున్నారని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. స్వయం ఉపాధి కోసం నిధులు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభు త్వం ఎన్ఎస్ఎఫ్‌డీసీ నిధులను నాలుగేళ్లుగా విడుదల చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. కొనే రు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనుల అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

వక్కెర వాగుపై వంతెన నిర్మించరూ..



పెంచికలపాడు వద్ద రోడ్డెక్కి ప్రవహిస్తున్న వక్కెర వాగు (ఫైల్)

కోడుమూరు రూరల్: గూడూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో పెంచికలపాడు గ్రామం వద్ద ఉన్న వక్కెర వాగుపై వంతెన లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులతో పాటు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వక్కెర వాగుపై ఉన్న వంతెన తక్కువ ఎత్తులో ఉండడం, చాలా వరకు పూడికతో నీరు వెళ్లే దారులన్నీ మూసుకుపోవడంతో చిన్న పాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డెక్కుతోంది. ఇటీవల కురిసిన వానలకు వంక పొంగి పొర్లడంతో గూడూరు నుంచి కర్నూలుకు వెళ్లే వాహనాలన్నీ గంటల తరబడి రోడ్డుపై నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే గ్రామంలో హైస్కూల్ కూడా వంకకు అవతల గూడూరు రోడ్డు వైపు ఉండడంతో వర్షాలకు వాగు పొంగినప్పుడు విద్యార్థులు భయంభయంగా వంకను దాటాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెంచికలపాడు వద్ద వక్కెర వాగుపై వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి



పోలకల్‌లో మహిళలకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డాక్టర్ అనీస్



ఓర్వకల్లు: మహిళలతో ప్రమాణం చేయిస్తున్న వైద్యాధికారులు

కోడుమూరు రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబాలు శక్తివంతంగా ఉంటాయని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కోడుమూరులోని ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్–2లో వైద్య సిబ్బంది స్వస్థ నారీ–స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచు భాగ్యరత్న హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఆహారం వల్ల రక్తపోటు, షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధు లు, క్యాన్సర్ వంటి భయానక జబ్బులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. సర్పంచు మాట్లాడుతూ.. మహిళలు తమ ఆరోగ్యానికి అధిక ప్రాధానత్యనిచ్చి తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మహిళలకు అన్ని రకాల ఆరోగ్య పరీ క్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, వైద్య సిబ్బంది కృష్ణమోహన్, కమాల్‌సాహెబ్, ఉమాబాయి, ఆ రోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

సి.బెళగల్: మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ అనీస్ సూచించారు. ఆయన బుధవారం స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్య అధికారులు, సిబ్బందితో కలిసి పీహెచ్‌సీలో మహిళలకు, గర్భిణులకు వ్యక్తిగత, కుటుంబ ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేశారు. డాక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని, తాము ఆరోగ్యంగా ఉండటంతో పాటు కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా గర్భిణులలో హైరిస్క్, రక్తహీనత లక్షణాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు బరువులు, బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. అవసరమైన వారికి ఐరన్ మాత్రలను అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామియ్యా, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఓర్వకల్లు: మహిళలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని ఎంపీపీ తిప్పన్న అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం, దేశ భవిష్యత్ ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ప్రధానంగా స్త్రీలలో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము కాన్సర్, గర్భాశయ కాన్సర్, పోషణ అభియాన్, ఈట్ రైట్, తల్లిబిడ్డల సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి, మానసిక వైద్య సేవలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కె.రాధామోహన్, సీహెచ్ఓ విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్తేర్‌రాణి, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యారాణి, వినీత పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతో కుటుంబ సంక్షేమం



కేక్ కట్ చేస్తున్న సర్పంచ్, డాక్టర్లు

కల్లూరు: ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ ఆనందరావు అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో స్వస్థ్‌నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ మాసెపోగు సుంకులమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్రంలో రక్తపోటు, మధుమేహం, మలేరియా, డెంగీ, క్షయ, టైఫాయిడ్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స అందిస్తామన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని.. అదే మన దేశానికి సౌభాగ్యమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉలిందకొండ సింగిల్ విండో చైర్మన్ రమణ సూచించారు. గర్భిణులు, బాలింతలకు, పండ్లు, బ్రెడ్డు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు!

- పెరుగుతున్న వీధి కుక్కల బెడద
- భయాందోళన చెందుతున్న ప్రజానీకం



గార్గేయపురం బస్టాండ్ వద్ద సంచరిస్తున్న వీధి కుక్కలు

కర్నూలు(రూరల్): ఎక్కడ చూసినా కుక్కలు భౌ.. భౌ.. అంటూ మొరుగుతూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ఏ వీధికెళ్లినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. కర్నూలు మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. రోజూ ఏదోక చోట, ఎవరో ఒకరు కుక్క కాట్లకు గురువుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారికి దాడికి దిగుతున్నాయి. విచక్షణ రహితంగా కరిచి గాయపరుస్తున్నాయి. ప్రధానంగా మాంసం, చేపలు, హోటళ్లు, దుకాణాల వద్ద, జనావాసాలు ఉన్న వీధుల్లో తిష్ట వేసి ఉంటున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారిపై ఒక్కసారిగా దాడి చేస్తున్నాయి. పల్లెల్లో కుక్కలు లేని వీధి లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. దీంతో చీకటి పడితే చాలు బయటకు రావడానికి జనం జంకుతున్నారు. చిన్న పిల్లలను సాయంత్రం వేళ బయటకు పంపడం మానేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన కుక్కకాటు కేసులు

మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలకు గాను గార్గేయపురం, ఇ.తాండ్రపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గత జూన్ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 62 కుక్క కాటు కేసులు, ఇ.తాండ్రపాడు కేంద్రంలో 78 కుక్క కాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారిని కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. నగర శివారులోని గ్రామాల వారు కుక్క కాటుకు గురైతే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పరుగులు పెడుతున్నారు.

మండల పరిధిలోని బి.తాండ్రపాడు కురువగేరిలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, పలువురిపై దాడి చేసి కరిచాయని గ్రామస్తులు వాపోతున్నారు.

- ఆర్.కొంతలపాడులో మారెమ్మ గుడి, బస్టాండ్, చికెన్ షాపుల వద్ద, చర్చి వీధిలో వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారులను వెంబడించి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.
- గార్గేయపురంలో తెలుగుగేరి, మాలపేట, మరాఠి గేరి, కోట వీధి, బీసీ కాలనీలో కుక్కలు పలువురిని గాయపరిచాయి.
- శివరామపురం వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో కుక్కలు తిష్ట వేసి రాత్రి సమయాల్లో వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి.

పంచాయతీలదే బాధ్యత

పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో ప్రజలకు వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. వీధి కుక్కలను పట్టుకొని పశు వైద్యాధికారితో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ)వేయించాలి. కుక్కల సంతతి పెరగకుండా వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. పెంపుడు కుక్కల యజమానులు పంచాయతీలో లైసెన్సు తీసుకొని, పన్ను కూడా చెల్లించాలి. కానీ పంచాయతీ పాలకులు మాత్రం కుక్కల సమస్య తమది కాదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో రోజురోజుకూ వీధి కుక్కల సమస్య పెరుగుతుంది.

కుక్క కాటుతో ఇబ్బంది పడ్డాను



మా గ్రామంలో పీర్ల చావిడి కాలనీలో వీధికుక్కలు ఎక్కువగా ఉన్నాయి. గత నెలలో నన్ను కుక్క కరిచింది. కుక్క కాటుతో చాలా ఇబ్బందులు పడ్డాను. ఆరె గేరిలో వీధి కుక్కలు ఎక్కువగా ఉండటం వల్ల పనుల నిమిత్తం ఆ కాలనీకి వెళ్లాలంటే కుక్కలు దాడిచేస్తాయేమోనని భయంభయంగా ఉంటోంది. గతంలో ఈ కాలనీలో ఎంతోమంది కుక్కకాటుకు గురయ్యారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– మున్వర్, పెయింటర్, గార్గేయపురం గ్రామం

వైభవంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



కోడుమూరులో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కోడుమూరు రూరల్: శ్రీ మద్విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని కోడుమూరులో విశ్వబ్రాహ్మణులు బుధవారం వైభవంగా నిర్వహించారు. జయంత్యుత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీకాళికాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం విశ్వకర్మకు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరశేఖర ఆచారి, ఉపాధ్యక్షుడు గుజురి వెంకటస్వామి, సభ్యులు రామక్రిష్ణ, గంగాధర్, వీరేష్, తిమ్మయ్య,శ్రీనివాసులుఆచారి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

అంతా బురదమయం!

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం కల్లూరు అర్బన్ శాంతినగర్, టెలికాంనగర్ పరిధిలోనిది. రోడ్డుపై గుంతలు ఉండడం, డ్రైనేజీ కాలువలు లేకపోవడం వల్ల రోడ్డుపై వర్షం నీరు, మురుగు నీరు నిలుస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు, మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– కల్లూరు